# పంచాయతీ రాజ్యంలో—

"రత్నం"

**కథానిక**

"మీరు నూతన పంచాయతీరాజ్య రథ సారథులు. ఇక భారమంతా మీ భుజస్కంధాలమీదే ఉంది. గ్రామాల్లో చక్కని రోడ్లూ- పార్కులూ- ఆటస్థలాలూ- పాయిఖానా దొడ్లూ- సైడ్ కాలవలూ ఏర్పరచటానికి మీరంతా పూనుకొంటారని ఆశిస్తున్నాను. దానికి మా ఆఫీసు వారమంతా పూర్తిగా సహకరిస్తాము. మీ సాధకబాధకాలను ఎప్పటికప్పుడు రిపోర్టుచేయండి. మేము వెంటనే తగుచర్య తీసుకొంటాం. పల్లెటూళ్ళు నిత్య కళ్యాణం... పచ్చల తోరణంగా కళకళలాడటమే మన ప్రభుత్వలక్ష్యం! గ్రామాలు స్వయంసమృద్ధాలై పంచాయితీరాజ్యం యేర్పడాలని మన నాయకుల దీక్ష! దానికి మీరంతా తోడ్పడతారని ఆశిస్తూ ఇంతటితో ముగిస్తున్నా."

కరతాళధ్వనులు మిన్నుముట్టినయ్ జిల్లా పంచాయితీ ఆఫీసరు ఉపసంహార వాక్యాలకు. కొత్తగా అధికారానికి వచ్చిన ఆ పంచాయితీ అధ్యక్షుల సభలో తాలూకా నలుమూలల్నుంచివచ్చిన వాళ్ళున్నారు. పొట్ట బొడిచినా అక్షరమ్ముక్క రాని వ్యవహారవేత్తలూ, పదవి తమ జన్మహక్కు- దానికోసమే పుట్టేమనుకునే కర్రపెత్తందార్లూ, రాష్ట్ర పంచాయితీసంఘం నాయకత్వపు పెనుగులాటలో ప్రచారానికి వచ్చిన నాయకమ్మన్యులూ, నాలుగురూకలు చేతులో పెడితే ఆఫీసుల చుట్టూ తిరిగి...పనులు చేయించుకొనివచ్చే—అదే జీవికగా ఉండే—పెద్దమనుషులూ— రకరకాలవాళ్లు ఆ సభ నలంకరించారు.

ఎత్తులమీద ఎత్తులువేసి, వేల రూపాయలు నీళ్ళలా ధారపోసి...వోట్లు కొనుక్కొని... గెల్చా మనిపించుకొన్న ఒట్టి భద్రయ్యలూ, కులంపేరుతో విజృంభించి... చేతులెత్తే ఎన్నికలో...ఏకగ్రీవంగా ఎన్నికయిన వీరవసంతరాయలూ; నిస్వార్థంగా ప్రజాసేవ చెయ్యాలని ఎన్నో వాగ్దానాలు చేసి గెల్చిన యువకులూ — అంతా ఆఫీసరుగారి ఉద్బోధకు తలపంకించి ఆదేపనిగా చప్పట్లు చరిచారు. జిల్లా ఆఫీసరు అంతటివాడు తమందరినీ సమావేశపరచి ఎన్నో హామీలిచ్చి వీపుతట్టడం వాళ్ళందరికీ అదో వింతగా...ఘనతగా గర్వంగా కూడా ఉంది.

* * *

తన గ్రామాన్ని గురించి ఓ సుందర స్వప్నం గన్నాడు కర్తవ్యోన్ముఖుడైన ధర్మయ్య. 'నున్నటి తీరయిన రోడ్లూ ... సెంటర్లలో చినచిన్న పార్కులూ—రేడియోలూ...ఆటస్థలాలలో ఆడుకొనే పిల్లలూ'—ఎంతయినా సాధించ వచ్చనుకున్నాడు.

ఆ మేజర్ పంచాయితీకి ఇరవయ్యేళ్ళ తర్వాత ఎలక్షన్లు జరిగినయ్ ప్రజాప్రభుత్వం ధర్మాన. బజారు కులపెద్దలు సభ్యులుగా ఉండేవాళ్లు ఆదివరకు. మీటింగంటూ జరిగేదో లేదోగాని, మినిట్ పుస్తకం యింటికే వచ్చేది వేలుముద్రలకి.

పాత ప్రెసిడెంటు మళ్ళా పోటీచెయ్యాలనుకున్నాడు మొదట. ఎలక్షన్ వారంరోజులున్నదనగా...చెంబుదీసుకొని తలుపుతెరచేసరికి...ఆ మసక సంజెలో, ఎదుట ఎత్తుగాఉన్న సిమెంటుగోడమీద నల్లటి అక్షరాలు కొట్లవచ్చినట్టు కన్పించేసరికి నిలువునా వణికిపోయాడు.

"ఇరవై ఏళ్ళనుంచి పోగయిన పాటలసొమ్మూ పన్నుల సొమ్మూ ఏమయింది?"

"పదెకరాల ప్రెసిడెంటు, వందెకరాల ఆసామీ ఎట్లయ్యాడు?"

"పంచాయతీ ఆఫీసుకని ఖర్చువ్రాస్తున్న ప్రెసిడెంటు స్వంతయింటి అద్దె పాతిక రూపాయలా?"

"రెండేళ్ళక్రితం శాంక్షన్ అయిన రోడ్లు ఇంకా ఎందుకేయించలేదు?"

చిత్రగుప్తుడి ఖాతాలా నిలదీసి అడుగుతున్నట్టు తాటికాయలంతేసి నల్లటి అక్షరాలు సింహద్వారానికెదురుగా కన్పించేసరికి గుండెలు గుభేలుమన్నయ్. పొగలా కమ్మిన ఆ ప్రచారపు ఊదరకు నిలబడే దమ్ములేక, పోటీ చేసే సంగతే తలపెట్టలేదు. చివరకి ధర్మయ్య గెలిచి ఇంట్లోనుంచి ఆఫీసు రికార్డంతా తరలించుకుపోతోంటే...తన హక్కేదో దొంగిలించుకుపోతున్నట్టు...కళ్ళనీళ్ళపర్యంతమై కంపించిపోయాడు.

ఏది ఎట్లా ఉన్నా ధర్మయ్య సంతకం చేసి, స్వాధీనం చేసుకొన్న చెక్కుబుక్కు మొత్తం పాతిక వేలదాకా ఉంది. సాలుకు ఏ రూపుగానైనా పదివేలకు పైగా ఆదాయం వచ్చే గ్రామమది. సక్రమంగా ఖర్చుపెట్టి ఎన్నిపనులయినా చేయించవచ్చునుకున్నాడు ధర్మయ్య.

* * *

తోడలోతు బురద గూరుకుపోయే తమ బజారుకు మొదటిలారీ కంకర వేసుకొని వచ్చేసరికి ప్రజల ఉత్సాహానికి అంతులేదు. తమ స్వంత పని అయినట్టు దగ్గరఉండి రోడ్డు వేయించుకున్నారు. సైడ్ కాలవదగ్గర పేచీపెట్టి ఆ రోడ్డు పడకుండా రెండేళ్ళనుంచి ఆపివేయించిన పెత్తందారు కోటయ్య ఇంటిముందు నిలువెత్తున పోసిన మెరకను చదును చేసి సైడ్ తీస్తుంటే కిమ్మనలేదు సరిగదా, సలహాలు కూడా యిచ్చాడు ధర్మయ్యకు.

తమకు ప్రత్యేకించిన చెరువుల్లో 'వేసవికి నీళ్ళకు ఇబ్బందిపడనక్కరలేదనీ, మురికులు కావనీ' నిశ్చింతగా చాకళ్ళు గుడ్డలుతుక్కుంటుంటే...పక్క చెరువుల్లో కొత్తగా కట్టిన చప్టామీదుగా నీళ్ళు తాగి పశువులు సంతృప్తిగా మోరలెత్తి చూచినవి.

పంచాయతీ వాళ్ళిచ్చిన పుస్తకం-పలకల్ని చంకల్లో పెట్టుకొని సెంటర్లలో వ్రాసిన పత్రికావార్తల్ని కూడబలుక్కుంటున్నారు పొలం వెళ్తూ కమతగాళ్లు.

ఆగష్టు 15 శుభమహోత్సవ సమయంలో...క్రొత్తగా వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అధ్యక్షతన క్రీడాస్థల ప్రారంభోత్సవం జరిగింది. చోటులేదనే దిగులు పోయి, పంచాయతీవాళ్ళు పెట్టిన చాక్లెట్లు చీకుతూ కేరింతలు గొడుతూ ఆడుకొంటున్న పిల్లల్ని చూసి ఎంతో ఆనందించాడు ధర్మయ్య.

గ్రామమంతా చైతన్యం క్రమ్మినట్టు ఆందోళన వచ్చినట్టుంది. ఎక్కడ చూసినా తమ యిబ్బందుల్ని గురించిన మెమోరాండాలూ ..చర్చలూ పన్నుల లోటుపాట్లను గురించిన విమర్శలూ రేగుతున్నయ్. పత్రికలు చదవటానికో రేడియో వింటానికో ... మీటింగు ఎట్లా జరుగుతుందో చూట్టానికో వచ్చినవాళ్ళతో పంచాయితీ ఆఫీసు అరుగులూ క్రిక్కిరిసి ఉండేవి.

"నాకు బండిలేదు..." పన్ను తీసెయ్యమని రిపోర్టు చేశాడో పేదరైతు.

"పూరిపాక కొంపకు ... పదిరూపాయలా పన్ను!"—న్యాయమడిగేడు ఎప్పుడో మేడలో ఉంటూ బ్రతికిచెడిన పెద్దమనిషి.

"అణా కానీ వ్యాపారానికి బేడ పన్నేస్తే యెలా?"—సవరణను తెలిజేశాడు ఓ దుకాణదారు.

"గుడిసెలకూ, చిన్న చిన్న వృత్తిపనులకూ పన్ను తీసెయ్యండి"—అర్జీ పెట్టుకున్నారు బీదా-బిక్కీ.

తను వ్రాసిన పన్ను లెక్కలన్నీ తప్పుల తడకలనీ...పన్ను తీసేస్తానని పకోడీ కోమటిదగ్గర కాజేసిన లంచం కక్కమనీ...ఆఫీసుకు రోజూ రావాలని—సతాయిస్తున్న ధర్మయ్య వైఖరి ఏ మాత్రం నచ్చలేదు పంచాయతీ గుమాస్తాకు. తాను ఆ గ్రామ పంచాయతీ గుమాస్తా అయినా ఇరుగు పొరుగు పంచాయితీలకు ప్రైవేటుగా ఎన్నిటికో లెక్కలు వ్రాశాడు. గడచిన పదేళ్ళ సర్వీసులో తన కెదురు చెప్పినవాళ్ళు లేరు! కొన్న రెండు మేడలూ...పోషిస్తున్న మోహనాంగులూ తన శక్తియుక్తులూ మోసపు టెత్తులూ అతణ్ణి అసమానంలో దింపినయ్.

కంట్రాక్టర్ సోమయ్యతో ఏవో టెండర్ల సంగతి గుసగుస లాడుతోంటే...లైట్లకని తెచ్చిన కిరసనాయిలు డబ్బాలు తరలించుకు పోతోంటే...లోపాయి కారిగా సగంపనే చేయించి దొంగ లాభాలు జేబులో వేసుకొంటుంటే—ధర్మయ్య మంచిగా చెప్పిన మటలు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ని ఉగ్రుణ్ణి చేసినవి.

డబ్బు కాజేసే కుంభకోణాలకు అలవాటు పడిన ఆఫీసరూ-గుమాస్తాలు ఇక తమ పప్పు లుడకవని గ్రహించారు.

నెల రోజులయింది పంచాయతీ ఆఫీసు తెరచి. ఆఫీసరూ-గుమాస్తా ఏమయ్యారో అంటూ పొంతూ

లేదు. 'ఆఫీసు రోజూ తెరవాలనీ...ఎజండా వ్రాసి మీటింగు వేయమనీ...మినిట్సు పుస్తకమన్నా యివ్వమనీ' రిజిస్టరు నోటీసులు వరసగా యిచ్చాడు ధర్మయ్య.

కంట్రాక్టర్ సోమయ్య ఆఫీసరునుంచి తెచ్చిన రాయబారం ధర్మయ్య నింకా రెచ్చగొట్టింది. 'టెండర్లన్నీ నా పర్యవేక్షణ క్రిందే జరగాలి. చెప్పింది చెప్పినట్టు తీర్మానం ప్యాసు చేయించాలి. కంట్రాక్టరూ తనూ పనిచేసే పద్ధతిలో ఎవరి జోక్యమూ పనికిరాదు. అంగీకరిస్తే ఆఫీసు తీస్తాను'-ఆఫీసరును గురించి తన సహజ చాతుర్యం కొద్దీ ఇంకా విపులీకరించాడు సోమయ్య.

"ఆ ఆఫీసరు సామాన్యుడు కాదు. ఫలానా అసెంబ్లీ సభ్యుడు ఇతడికి వేలు విడిచిన మేనమామ. అందరం కలిసుంటే మీకూ మాకూ నాలుగు డబ్బులు మిగులుతయ్. ఇదివరకు పనిచేసిన చోట్లా ఆఫీసరూ—ప్రెసిడెంటూ కుమ్మక్కుగా ఉండే వాళ్ళట!"—ఆ బెదిరింపులకీ...ఆశలకీ హిరణ్యాక్ష వరాలకీ మండింది ధర్మయ్యకు.

పై అధికారులకు రిపోర్టు చేశాడు ఆఫీసరు అగడాన్ని గురించి, పంచాయతీ చేత తీర్మానం చేయించి.

మూడు నెలలయింది మీటింగు జరిగి. మాజీ ప్రెసిడెంటూ, పెత్తందారు కోటయ్యా కంట్రాక్టరు సోమయ్యలతో కలిసి ఆఫీసరు గుమాస్తాలు జిల్లా పంచాయతీ ఆఫీసులో కన్పించారని ఎవరో వార్త అందించారు ధర్మయ్యకు. అధికారమంతా ఆఫీసరుదే గనుక ముద్ర శుద్ధిగా...నెలనెలా...జీతం పుచ్చుకొంటున్నారు ఇద్దరూ. తమ జీతంలో సగం మాత్రమే యిచ్చి ఇక లేదు పొమ్మన్నాడని వీధులూడ్చేవాళ్ళూ ... లైట్లు వెలిగించేవాళ్ళూ ధర్మయ్యకు రిపోర్టు కూడా చేశారు. ఇక లాభం లేదని పిటీషన్ల మీద పిటీషన్లు పెట్టాడు పై ఆఫీసర్లకు ధర్మయ్య.

* * *

సంవత్సరమయింతర్వాత తనిఖీకి వస్తున్నానని అకస్మాత్తుగా తాఖీదు పంపేడు పై ఆఫీసరు. క్రింది వివరాలు చూసేసరికి ధర్మయ్యకు బైర్లు కమ్మినయ్.

'ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు రిపోర్టు చేశాట్ట. తను వచ్చేముందు జరిగిన పంచాయతీ పనులు సక్రమంగా లేవట! డబ్బు దుర్వినియోగమైనట్టు'అనుమానమట!!

తను రిజిష్టర్ చేసి పంపిన నోటీసు కాపీలూ... పిటిషన్లూ ఏ గంగలో కలిసినట్టు! ఏది నిజం? ఏది అన్యాయం? ఉక్కిరి బిక్కిరి అయ్యాడు ధర్మయ్య.

పై ఆఫీసరు అటూ యిటూ నడుస్తూ మాజీ ప్రెసిడెంటూ, పెత్తందారు కోటయ్యా కంట్రాక్టర్ సోమయ్యా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరూ, గుమాస్తా—చూశావా మా దెబ్బ!—అన్నట్లు విషపుచూపు చూశారు ఎదురువచ్చిన ధర్మయ్యవంక.

ఆఫీసరువారు వచ్చాడని తెలిసి, పళ్ళూ ఫలహారాలతో హాజరై, సంవత్సరం తిరక్కముందే పెళ్ళాంపేర పదివేలు బ్యాంకిలో వేయగల్గిన పక్క ఊరి ప్రెసిడెంటు, పలకరించిన ధర్మయ్యని చూసి పకపకా నవ్వేడు.

ఆ కర్తవ్య పథంలో ముళ్ళబాదలూ, అడ్డుకంచెలూ, ఎదురై ఏం అనుభవం దొరికిందో, ఏ పీడకలలు హృదయంలో చీకటినీ-చిచ్చునూ తెచ్చిపెట్టేయో గాని ఆఫీసరువారిని కలుసుకొని ఓ కాగితం అందించాడు ధర్మయ్య.

అది న్యాయం పేరుతోను, ధర్మం పేరుతోను ప్రెసిడెంటు పదవికి ధర్మయ్య యిచ్చిన రాజీనామా!

---

మానవచరిత్రలో యింతవరకూ అందుబాటులో లేని విద్యాసౌకర్యాలు యీ శతాబ్దంలో ఉన్నవి. స్కూళ్లు, యూనివర్శిటీలు, లైబ్రరీలు, టీచర్లు, ప్రొఫెసర్లు, వార్తాపత్రికలు, ఉపన్యాసకులు విమర్శలు, రేడియో, సినిమా—ఇదివరకెన్నడూ లేనంతమంది యీ తరంలో తయారయారు. కాని ఫలితం? ఇప్పుడున్నంత అశాంతి, క్రౌర్యం, యుద్ధకాంక్ష, ఇంద్రియ దౌర్బల్యం, స్వార్థపరత్వం, ఇదివరకు మానవచరిత్రలో లేవు.—నార్మన్ ఏంజెల్.